క్లుప్తంగా

సేవ చేయడంలోనే సంతృప్తి



చీరలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్

బాలాజీచెరువు: పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న లెప్రసీ కాలనీ వాసులకు హరీష్ చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన చీరలు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపాణ్యం మాట్లాడుతూ సంపాదనలో సామాజిక సేవకు ఆ ట్రస్ట్ చైర్మన్ హరీష్ కొంత కేటాయించడం సంతోషకరమని, అలాగే తమ కళాశాలలో స్టేడియం నిర్మించి సహకారం అందిస్తామన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాలతి ఏర్పాటు చేసిన అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మజ్యోతి, మర్రి రంగనాథ్, సాయి, మణికంఠ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అద్వితీయ 2కే పోస్టర్ ఆవిష్కరణ



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీ నాయుడు, ప్రిన్సిపాల్ కరుణ

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ మహిళా కళాశాలల మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించే అద్వితీయ–2కే 23 సదస్సు పోస్టర్ ఆవిష్కరణ బుధవారం జరిగింది. దీనిని కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీవీవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ కె.కరుణ ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ సదస్సును ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్ జీ-కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తామన్నారు. మార్కెటింగ్, ఫైనాన్స్, డిజిటల్ మార్కెటింగ్ వంటి అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీకాంత్, బీబీఏ హెడ్ జి.అబ్రహం పాల్గొన్నారు.

సర్వే రాళ్ల పంపిణీ వేగవంతం



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వేకు సంబంధించి రీసర్వే ముగిసిన గ్రామాల్లో భూమి సరిహద్దులు తెలిపే సర్వే రాళ్ల పంపిణీ వేగవంతం చేయాలని ఆర్డీవో బీవీ రమణ అన్నారు. బుధవారం కాకినాడ డివిజనల్ స్థాయి తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా రైతులను సమాయత్తం చేయాలని, సర్వే రాళ్లకు సంబంధించి రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియ వేగంగా ముగించాలన్నారు. అందుకు అవసరమైన భూముల కచ్చితత్వం, విలువ అభ్యంతరాలపై వచ్చే దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో పరిపాలనాధికారి జి.వరహాలయ్య పాల్గొన్నారు.

రాజకుమార్‌రెడ్డికి డాక్టరేట్



రాజకుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న జోసఫ్ స్టీఫెన్, అధ్యాపకులు

కాకినాడ రూరల్: తిమ్మాపురంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్ రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగంలో అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న పల్లాల రాజకుమార్‌రెడ్డి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఆచార్య పి.అరుణ్‌కుమార్, డాక్టర్ పి.ప్రేమానందం పర్యవేక్షణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల్లో గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యం అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో బుధవారం రాజకుమార్‌రెడ్డిని విభాగాధిపతి డాక్టర్ కె.జోసఫ్ స్టీఫెన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ కమల కుమారి, సహాయ ఆచార్యులు సత్యనారాయణ, నానిబాబు, హరిబాబు, గోపి, హైకోర్టు న్యాయవాది సన్నపు కుమారస్వామి, లలితకుమారి, రాజ్‌కుమార్, విద్యార్థినీ విద్యార్థులు శాలువాతో సత్కరించి అభినందించారు.

కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువజన కేంద్రం, అర్థ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నన్నయ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరామరాజు, విద్యార్థులు జీవితంలో ఎదగడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అబ్దుల్ కలాం, మదర్‌థెరిసా జీవిత చరిత్రలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కెరీర్ సెల్ కోఆర్డినేటర్ మల్లికార్జున నాయక్, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, నెహ్రూ యువజన కేంద్ర కోఆర్డినేటర్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంట.. కొత్త కాంతులు

- జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు
- తిమ్మాపురం, నేమాం లే అవుట్‌లలో కొత్త కనెక్షన్లు
- లబ్ధిదారుల్లో ఆనందం



తిమ్మాపురం జగనన్న కాలనీలో వేసిన విద్యుత్ స్తంభాలు



ఓ ఇంటికి ఉచితంగా ఏర్పాటు చేసిన మీటర్

కాకినాడ రూరల్: జగనన్న కాలనీలు కొత్త ఊళ్లను తలపిస్తున్నాయి.. ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు పెద్ద ఎత్తున భూ సేకరణ చేసి లే అవుట్లను ఏర్పాటు చేసింది. వాటిని మెరక చేయడంతో పాటు స్థలాలుగా విభజించి లబ్ధిదారులకు కేటాయించింది. గృహ నిర్మాణాలకు అనువుగా రోడ్లు, విద్యుత్ లైన్లు, నీటి సదుపాయం వంటి మౌలిక సదుపాయాలు కల్పించింది. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సుమారు 32 వేల మందికి ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కరప, కాకినాడ రూరల్ మండలాల్లో లబ్ధిదారులతో పాటు అర్బన్‌లోని రూరల్ నియోజకవర్గ 8 డివిజన్ల లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. దీంతో తిమ్మాపురం, నేమాం– 3 లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ స్థలాలు పొందిన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు స్వయంగా దగ్గరుండి పనులు చేయించుకుంటున్నారు. ప్రభుత్వపరంగా వారికి గృహ నిర్మాణ శాఖ అధికారులు అండగా ఉంటున్నారు. తిమ్మాపురం లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేలా డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి పర్యవేక్షిస్తున్నారు. తిమ్మాపురం లేఅవుట్‌ను 50.30 ఎకరాలతో అభివృద్ధి చేయగా, సుమారు 1,919 మందికి పట్టాలు ఇచ్చారు.

మొదటి ఫేజ్‌లో 1,492 ఇళ్లను మంజూరు చేశారు. ఇప్పటికే సుమారు రెండు వందల ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వగా కొందరు నివాసానికి వచ్చారు. వివిధ దశలో 500 వరకూ ఇళ్లు ఉన్నాయి. కాలనీలో గృహ నిర్మాణాలకు తోడు రోడ్ల ఏర్పాటుతో కొత్త ఊరును తలపిస్తుంది. ఈ లేఅవుట్‌లో పూర్తిగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు అడిగిందే తడువు అన్నట్టు విద్యుత్ శాఖ అధికారులు ఉచితంగా కనెక్షన్లు అందిస్తున్నారు. సర్వీసు వైరు, బోర్డు, ఎంసీబీ, మీటరు కనెక్షన్ ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని, తిమ్మాపురంలో 177 మందికి కనెక్షన్లు ఇచ్చినట్టు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. నేమాం– 3 లేఅవుట్‌ను 88.40 ఎకరాలతో ఏర్పాటు చేయగా 3,223 మందికి పట్టాలు ఇచ్చారు. మొదటి విడతగా 2,754 మందికి గృహాలు మంజూరు చేయగా ఇప్పటికే చాలా మంది పూర్తి చేశారు. వీరందరికి విద్యుత్ సదుపాయం కల్పించారు.

ఎమ్మెల్యే సమీక్షలతో సత్ఫలితాలు

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పెద్దఎత్తున భూసేకరణ చేసి, పేదలకు దాదాపు 32 వేల ఇళ్ల పట్టాలు కేటాయించి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఘనత సాధించారు. ఆయా కాలనీల అభివృద్ధి, గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేలా తరచూ అధికారులతో సమీక్షలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల అర్జీలు కూడా పనులు వేగవంతమయ్యేందుకు దోహదపడుతున్నాయి.

సొంతింటి కల నెరవేరింది



సొంతింటి కల నెరవేరింది. ప్రభుత్వం ఇళ్ల స్థలం ఇవ్వడంతో వెంటనే ఇంటిని నిర్మించుకున్నాం. ఉచితంగా మీటర్ వేసి కనెక్షన్ ఇవ్వడంతో తిమ్మాపురం జగనన్న కాలనీలో కొత్త ఇంట్లో నివాసం ఉంటున్నాం. ప్రభుత్వపరంగా స్థలం మంజూరు చేసి గృహ రుణం అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కన్నబాబులకు ధన్యవాదాలు.

– కర్రి అర్జావతి, లబ్ధిదారు, తిమ్మాపురం

విద్యుత్ కనెక్షన్‌కు చర్యలు



తిమ్మాపురం లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు గ్రామ పంచాయతీ పరంగా అండగా నిలుస్తున్నాం. లబ్ధిదారులకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రభుత్వం ఉచితంగా అందించే విద్యుత్ కనెక్షన్ వేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు విద్యుత్ శాఖ అధికారులు సహకరిస్తున్నారు.

– బెజవాడ సత్యనారాయణ, సర్పంచ్, తిమ్మాపురం

ముసాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



వేములవాడలో ముసాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కరప మండలం వేములవాడ గ్రామంలో ముసాలమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని బుధవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు తదితరులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వేములవాడ అభివృద్ధితో పాటు అమ్మవారి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

పండూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు గరగ పెదకాపు, వెంకన్నబాబు, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించారు. పెదకాపు కుమారుడు బాబ్జీ ఇటీవల చేబ్రోలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో తీవ్ర విషాదంలో ఉన్న పెదకాపు, పెద కుమారుడు వెంకన్నబాబులను ఆయన ఓదార్చారు.

సాగునీరు అందించాలి

కాకినాడ సిటీ: పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో కాకినాడ ధర్నా చౌక్ వద్ద తాళ్లరేవు మండలం పి.మల్లవరం, గ్రాంట్‌లకు చెందిన రైతులు ధర్నా నిర్వహించారు. ఏటా వందలాది ఎకరాలు పొట్ట దశలో ఎండిపోతున్నాయన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. సంఘ నాయకులు వల్లు రాజబాబు, జి.శ్రీనివాసరావు, పిల్లి గోవిందు, పంపన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

సమీక్షలో కమిషనర్ రమేష్



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్

కాకినాడ: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహ నిర్మాణాలకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావుతో కలసి హౌసింగ్, నగరపాలక సంస్థ, ప్రత్యేకాధికారులతో గృహ నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొమరగిరి లేఅవుట్‌లో ఇప్పటికే వేగం పుంజుకొన్న గృహ నిర్మాణాలకు సంబంధించి వివిధ దశలు పూర్తి చేసుకున్న ఇళ్లకు జియో ట్యాగింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కోరారు. అలా సకాలంలో పూర్తి చేయడం ద్వారా నగదు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ఉంటుందన్నారు. ఎంపికైన లబ్ధిదారులకు త్వరితగతిన ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతాలు తెరిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణాలకు ప్రస్తుత సమయం అనుకూలంగా ఉన్నందున మరింత వేగంగా ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గృహ నిర్మాణ లబ్ధిదారులుగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 వేల బ్యాంకు లింకేజీ మరింత వేగంగా పూర్తయ్యేలా బ్యాంకర్లతో సంప్రదింపులు జరపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఉగాది నాటికి పెద్ద సంఖ్యలో గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో కొమరగిరి లేఅవుట్ ఒక టౌన్‌షిప్‌గా అవతరించబోతుందని, అందువల్ల లబ్ధిదారులకు అర్థమయ్యేలా వివరించి ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతమయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ సూచించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అక్కడ ఇటుకల బట్టీ కేంద్రంతో పాటు నిర్మాణ సామగ్రి నాణ్యత, నిర్ధారణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇంటి నిర్మాణం సమయంలో ఎలాంటి సాంకేతిక పరమైన ఇబ్బందులు, సమస్యలు ఉన్నా ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని ఏడీసీ కోరారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ఈఈ గుప్త, డీఈ సత్యనారాయణరెడ్డి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రహణం మొర్రికి ఉచిత పరీక్షలు



గ్రహణం మొర్రి పరీక్షలు చేస్తున్న బసవతారకం హాస్పిటల్ వైద్యులు

కాకినాడ సిటీ: జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్‌లోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం గ్రహణం మొర్రి ఉన్న వ్యక్తులకు ఉచిత పరీక్షలు నిర్వహించినట్లు సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు తెలిపారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పరీక్షలు నిర్వహించిన వారిలో 29 మందికి గ్రహణ మొర్రి ఆపరేషన్లకు సూచించారన్నారు. శస్త్ర చికిత్సలకు వెళ్లేవారికి బసవతారకం హాస్పిటల్ వారు ఉచిత రవాణా ఖర్చులు ఇస్తారని తెలిపారు. డాక్టర్ జోషి మాట్లాడుతూ 21 మండలాల నుంచి వచ్చిన దివ్యాంగులకు పరీక్షల నిర్వహించగా 20 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశామన్నారు. వారికి ఈ నెల 20, 24 తేదీల్లో హైదరాబాద్‌లోని బసవతారకం హాస్పిటల్‌లో శస్త్రచికిత్సలు జరుగుతాయని నాగేశ్వరరావు తెలిపారు.

ఈశ్వరానుభూతికి స్వర్ణలింగ దివ్య దర్శనం

నేటి నుంచి 25 అడుగుల శివలింగం ఏర్పాటు



సర్పవరం జంక్షన్ వద్ద జరుగనున్న శివరాత్రి ఉత్సవాల గురించి వివరిస్తున్న సిస్టర్ మీరా

కాకినాడ రూరల్: మహా శివరాత్రి సందర్భంగా ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సర్పవరం జంక్షన్ బ్రహ్మకుమారీస్ శాంతిధామ్ ఎదురుగా 25 అడుగుల స్వర్ణలింగం గురువారం నుంచి భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్లు సిస్టర్ మీరా తెలిపారు. 87వ త్రిమూర్తి శివ జయంతి సందర్భంగా ఈ ఏర్పాట్లు చేశామని బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె తెలిపారు. ఈశ్వరానుభూతికి స్వర్ణలింగ దివ్య దర్శనం చేసుకునేందుకు భారీగా భక్తులు తరలి రావాలని కోరారు. తొలిరోజు గురువారం మధ్యాహ్నం సర్పవరం జంక్షన్ నుంచి ఏపీఎస్పీ వరకూ త్రిమూర్తి శివ జయంతి ఉత్సవాలను ప్రారంభోత్సవంగా విద్యార్థులతో ఆధ్యాత్మిక శాంతి యాత్ర నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు 25 అడుగుల ఎత్తయిన దివ్య స్వర్ణలింగ ప్రతిష్ఠాపనతో శాంతి యాత్ర చేపడతామన్నారు. బ్రహ్మకుమారీ బీకే రజని పర్యవేక్షణలో జరిగే శివరాత్రి వేడుకల్లో భాగంగా భక్తులకు శివలింగ దర్శనం కోసం అన్ని ఏర్పాటు చేశామని, శుక్రవారం సాయంత్రం నుంచి 20వ తేదీ ఉదయం వరకూ ఉదయం, సాయంత్రం శివలింగాన్ని భక్తులు దర్శనం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో బ్రహ్మకుమారీస్ వాసవి, గంగ, రాజేశ్వరి, కమల తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పొదుపు అవసరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ ఆఫీసర్ నాగప్రవీణ్

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరికీ పొదుపు అవసరమని ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ ఆఫీసర్ నాగప్రవీణ్ అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా బుధవారం కాకినాడలోని భవానీ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీలో ఆర్‌బీఐ, యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ కార్మికులకు బ్యాంకింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రస్తుతం బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా డిజిటల్ లావాదేవీలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ లావాదేవీలను వివేకంతో ఉపయోగించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సీహెచ్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీకృష్ణారెడ్డి

కాకినాడ రూరల్: తల్లిదండ్రులు పడిన కష్టాన్ని గుర్తించి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సర్పవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ అన్నారు. సర్పవరంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం హెచ్ఎం కృష్ణమూర్తి అధ్యక్షతన యాంటీ ర్యాగింగ్– గుడ్ టచ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, భవిష్యత్‌ను బంగారంలా తీర్చుదిద్దుకోవాలన్నారు. ఎస్సై మౌనిక మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. వేగంగా వాహనాలను నడపడం వల్ల కలిగే అనర్థాలు వివరించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దేవి, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు కొమ్ముల రూప అనుపమ, ఆళ్ల వెంకట సత్యగౌరిదుర్గ, కూనిశెట్టి అన్నపూర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని తమ సందేశాన్ని విద్యార్థులకు అందించారు.

అప్రమత్తతతో విపత్తుల నివారణ

సామర్లకోట: అప్రమత్తతతో విపత్తులను నివారించవచ్చని, వరదల్లో చిక్కుకున్న వారిని ఏవిధంగా రక్షించాలో ఆపద మిత్రలకు ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది వివరించారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన 105 మంది ఆపద మిత్రలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ జరుగుతుంది. బుధవారం జి.రాగంపేటలో ఫీల్డ్ విజిట్ జరిగింది.

జగనన్న పాలనలో మైనార్టీల సంక్షేమం

రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బషీరుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బషీరుద్దీన్

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం సాధ్యమైందని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నగర మైనార్టీ సెల్ సమావేశం జరిగింది. అధ్యక్షుడు ఖాలీద్ బిన్ వలీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బషీరుద్దీన్ మాట్లాడుతూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేసిన విమర్శలపై మండిపడ్డారు. టీడీపీ పాలనలో మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. కొండబాబు హయాంలో రూ.70 లక్షల అభివృద్ధి పనులు జరిగితే.. ప్రస్తుత ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హయాంలో రూ.9 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. టీడీపీ– వైఎస్సార్ సీపీ హయాంలలో జరిగిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని బషీరుద్దీన్ సవాలు విసిరారు. టీడీపీ ప్రభుత్వంలో పెద్ద మసీదు అభివృద్ధికి రూ. కోటి నిధులు ఇస్తామని జీవో కూడా ఇచ్చి మోసం చేశారని అన్నారు. మక్కా యాత్రకు వెళ్లేవారి కోసం ఏర్పాటు చేసిన సమావేశాన్ని 'ఇదేం ఖర్మరా బాబూ' కార్యక్రమంగా మార్చివేసి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, డైరెక్టర్ చోటు, రూరల్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీం బాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బహుదూర్, నాయకుడు అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యం కావాలి

కాకినాడ సిటీ: అఖిల భారత కార్మిక సంఘాల సమైక్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ సమావేశం బుధవారం కాకినాడలోని జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ మాట్లాడుతూ పోర్టు పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు భద్రత కరువైందన్నారు. హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. అంబటి ఆయిల్స్ పరిశ్రమలో మరణించిన ఏడుగురు కార్మికులకు సంతాపం తెలిపారు. ఏఐఎఫ్‌టీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్, జిల్లా కమిటీ సభ్యులు టి.శ్రీను, కాలా రమణ, బాలసుబ్రహ్మణ్యం, కుమార్, శేషగిరిరావు పాల్గొన్నారు.